

లాస్ ఏంజిలిస్‌లో ట్రంప్ బెలూన్‌తో నిరసనకారుల ఆందోళన

# ట్రంప్‌పై జనాగ్రహం

- బర్త్‌డే వేళ అమెరికా వ్యాప్తంగా నిరసనలు
- రోడ్లపైకి వేలాది మంది
- దాదాపు 2 వేల చోట్ల 'నో కింగ్స్' ప్రదర్శనలు
- ప్రజాస్వామ్య, వలసదారుల హక్కుల రక్షణకు నినాదాలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 79వ జన్మదినం వేళ నిరసనలతో అమెరికా అట్టుడికింది. ట్రంప్ వ్యతిరేకులతో శనివారం అమెరికా వీధులు, పార్కులు నిండిపోయాయి. ప్రదర్శనకారులు పెద్ద ఎత్తున గుమికూడి ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. దాదాపు 2 వేల చోట్ల 'నో కింగ్స్' ప్రదర్శనలు జరిగాయి. డౌన్‌టౌన్‌లు, చిన్న పట్టణాలు గుండా కవాతు చేస్తూ ప్రజాస్వామ్యం, వలసదారుల హక్కులను పరిరక్షించాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యూఎస్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ భవనం ముందు నిరసన తెలిపిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోర్ట్‌ల్యాండ్ పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. యూటాలోని సాల్ట్‌లేక్ సిటీ డౌన్‌టౌన్‌లో జరిగిన మార్చ్ సందర్భంగా జరిగిన కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కాల్పుల్లో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కాల్పులు జరిపిన వ్యక్తిగా భావిస్తున్న నిందితుడితోపాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ట్రంప్ మస్ట్ గో నౌ..**

న్యూయార్క్, డెన్వర్, షికాగో, ఆస్టిన్, లాస్‌ఏంజిలిస్‌లలో ట్రంప్ వ్యతిరేకులు భారీ కవాతు నిర్వహించారు. డ్రమ్స్ వాయిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొందరు 'నో కింగ్స్' బ్యానర్లు ప్రదర్శించారు. అట్లాంటాలో 5 వేల మంది, సియాటిల్ ర్యాలీకి 70 వేల మందికిపైగా హాజరయ్యారు. మరో వైపు, తన పుట్టిన రోజు నాడే జరిగే ఆర్మీ 250 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే సైనిక కవాతులో పాల్గొనేందుకు ట్రంప్ వాషింగ్టన్‌లో ఉన్నారు. వాయువ్య వాషింగ్టన్‌లోని లోగన్ సర్కిల్‌లో దాదాపు 200 మంది నిరసనకారులు గుమికూడి 'ట్రంప్ మస్ట్ గో నౌ' (ట్రంప్ ఇప్పుడే వెళ్లాలి) అని నినదించారు. ఈ సందర్భంగా ట్రంప్ కిరీటం ధరించి, బంగారు టాయిలెట్‌పై కూర్చున్న వ్యంగ్య చిత్రాన్ని ప్రదర్శించారు.

## ఆస్ట్రేలియాలో పోలీసుల కర్కశత్వం

**భారత సంతతి వ్యక్తి మృతి**

అడిలైడ్: ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో భారత సంతతికి చెందిన గౌరవ్ కుండి అనే యువకుడిపై అక్కడి పోలీసులు ఇటీవల కర్కశంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన గౌరవ్.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆస్ట్రేలియా పోలీసుల చర్య జార్జి ఫ్లాయిడ్ ఉదంతాన్ని తలపించింది. అడిలైడ్‌లో ఉండే గౌరవ్ కుండి, అమృత్‌పాల్ కౌర్ దంపతుల మధ్య ఇటీవల చిన్న వాగ్వాదం చోటుచేసుకుంది. అది గమనించిన పెట్రోలింగ్ పోలీసులు, గృహహింసగా భావించారు. గౌరవ్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గౌరవ్‌ను కిందపడేసి, మెడపై మోకాలితో తొక్కిపెట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.

# ఇరాన్ 'ఎనర్జీ'పై ఇజ్రాయెల్ దాడి

**గ్యాస్, ఆయిల్ క్షేత్రాలే లక్ష్యంగా దాడులు**

- ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ఫీల్డ్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్ వైమానిక దళం
- ఇరాన్ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే ప్రయత్నం
- మూడో రోజూ పరస్పర దాడులు
- ఇరాన్‌లో సుమారు 400 మంది, ఇజ్రాయెల్‌లో 14 మంది మృతి



టెహ్రాన్‌లో మండిపోతున్న సహ్రాన్ చమురు డిపోను గమనిస్తున్న స్థానికులు

జెరూసలేం, జూన్ 15: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మూడో రోజు కూడా దాడులు, ప్రతి దాడులు కొనసాగాయి. ప్రపంచంలోనే అతి పెద్ద గ్యాస్ ఉత్పత్తి కేంద్రమైన సౌత్‌పార్స్ క్షేత్రంపై ఇజ్రాయెల్ ఆదివారం దాడి చేసి ఇరాన్‌ను భారీగా దెబ్బతీసింది. ఇరాన్ అణు కేంద్రాలు సహా 150కి పైగా లక్ష్యాలపై విరుచుకుపడింది. ఈ దాడులతో 11 నిల్వ ట్యాంక్‌లు ఒకదాని వెంట మరొకటి భారీ శబ్దంతో పేలిపోతుండడంతో పెద్దయెత్తున అగ్నికీలలు ఎగసిపడ్డాయి. అగ్నికీలలు సమీప ప్రాంతాలకు కూడా వ్యాపించి భారీ నష్టం వాటిల్లింది. టెల్ అవీవ్ దాడుల్లో షహ్రాన్‌లోని భారీ గ్యాస్ క్షేత్రం కూడా ధ్వంసమైనట్టు ఇరాన్ చమురు మంత్రిత్వ శాఖ అధికారులు ధ్రువీకరించారు. గ్యాస్‌క్షేత్రాల భస్మీపటలంతో ఆ దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన వైమానిక, రక్షణ స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత ఆదివారం తెల్లవారుజామున ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖను లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు జరిపింది. అలాగే ఇరాన్ కూడా ఇజ్రాయెల్ వాయు రక్షణ వ్యవస్థను చీల్చుకుని పలు నగరాలపై దాడులు జరిపింది.

**ఇజ్రాయెల్‌లో 14 మంది, ఇరాన్‌లో 406 మంది మృతి**

ఇరాన్ ఆదివారం జరిపిన దాడిలో ఇజ్రాయెల్‌లో 10 మంది మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 14కు చేరింది. కాగా, ఇరాన్‌లో తాజాగా ఎంతమంది మృతి చెందినదీ ఆ దేశం అధికారికంగా వెల్లడించ లేదు. అయితే శనివారం నాటికి 78 మంది మరణించగా, 320 మంది గాయపడ్డట్టు ఆ దేశ దౌత్య అధికారి తెలిపారు. కాగా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్‌లో 406 మంది మరణించగా, 654 మంది గాయపడ్డట్టు హ్యూమన్ రైట్స్ గ్రూప్ తెలిపింది.

**అమెరికాపై మండిపడ్డ ఇరాన్ అధ్యక్షుడు**

ఇరాన్‌పై దాడికి అగ్రరాజ్యం అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు తెలపడం పట్ల ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజిష్కియన్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఇజ్రాయెల్ కనుక దాడులు ఇలాగే కొనసాగిస్తే తమ ప్రతిస్పందన నిర్ణయాత్మకంగా, తీవ్రంగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. అమెరికా అనుమతి లేకుండా ఇలాంటి దాడికి దిగే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదని అన్నారు. కాగా, పాలన మార్పు తమ లక్ష్యం కాదని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియన్ సార్ తెలిపారు.

**ఆత్మరక్షణ కోసమే దాడులు**

ఆత్మరక్షణ కోసమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ చెప్పారు. ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే తామూ వాటిని నిలిపివేస్తామని, ఇజ్రాయెల్ చర్యలకు భాగస్వామిగా ఉన్న అమెరికా దాడులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.

**ఫ్యాక్టరీలు వదిలి పోండి**

మిలిటరీ ఆయుధాల తయారీ ఫ్యాక్టరీల నుంచి ఇరాన్ పౌరులు వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ మిలిటరీ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు మిలిటరీ ప్రతినిధి కర్నల్ అవిచాయ్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ రానున్న కాలంలో తాము వీటిపై దాడి చేసే అవకాశాన్ని తెలియజేశారు.

**భారీ మూల్యం తప్పదు**

ఇజ్రాయెల్‌లో పౌరులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడికి ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకుంటుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరించారు. 'ఉద్దేశపూర్వకంగా చేసిన పౌరులు, మహిళలు, పిల్లల హత్యలకు ఇరాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుంది. వారిపై అధిక శక్తితో దాడి చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

## నెక్స్ట్ టార్గెట్ ఖమేనీ!

**ఇరాన్ సుప్రీం లీడర్‌పై ఇజ్రాయెల్ గురి**

టెల్ అవీవ్: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నట్టు మీడియా కథనాలు వెలువరించాయి. తమ తదుపరి లక్ష్యంగా ఆయన మారవచ్చునని ఒక సీనియర్ అధికారి వాల్ స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. ఇరాన్ స్వచ్ఛందంగా తన అణు కార్యక్రమాన్ని తొలగించుకునే వరకు లేదా దానిని ఇరాన్ పునర్నిర్మించుకోవడం అసాధ్యంగా మారినప్పుడు మాత్రమే ఈ సంక్షోభానికి తెర పడుతుందని ఆయన పేర్కొన్నారు.

**ఖమేనీ హత్య ప్రణాళికను వీటో చేసిన ట్రంప్**

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హత్య చేయాలనే ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీటో చేశారని ఇద్దరు అమెరికా అధికారులు తెలిపారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును ప్రశ్నించగా తాను దానిలోకి వెళ్లబోవడం లేదని తెలిపారు. ఇరాన్‌పై దాడుల గురించి అమెరికాకు ముందస్తు సమాచారం అందజేసినట్టు ఆయన తెలిపారు.

**భారత్, పాక్ వార్ తరహాలోనే..**

## ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం ఆపేస్తా: ట్రంప్

వాషింగ్టన్: భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధానికి తానే తెరదించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో దీర్ఘకాలంగా శత్రువులుగా ఉన్న దేశాల మధ్య త్వరలోనే శాంతి నెలకొంటుందని ఆయన అన్నారు. నాలుగు రోజుల సైనిక వివాదం తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించానన్న తన వాదనను ట్రంప్ పునరుద్ఘాటిస్తూ అదే మాదిరి ఇరాన్-ఇజ్రాయెల్ కూడా ఒక ఒప్పందానికి రావాల్సి ఉందని, ఆ దిశగా తాను ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే రెండు దేశాల మధ్య శాంతి నెలకొంటుందన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్న మొదటి విడత సమయంలో కూడా పలు దేశాల మధ్య ఉన్న వైరాన్ని తొలగించి శాంతిని నెలకొల్పినట్టు ఆయన తెలిపారు. సెర్బియా, కొసావో దేశాల మధ్య ఉన్న దశాబ్దాల నాటి విభేదాలను తొలగించి, ఇద్దరికీ రాజీ కుదిర్చినట్టు చెప్పారు.

## వరల్డ్ వార్-3 దిశగా!

మొదటిపేజీ తరువాయి...

కూడా యుద్ధంలో నేరుగా పాల్గొన్నట్టే. అవసరమైతే తాము నేరుగా యుద్ధంలో అడుగుపెడతామని ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ హామీ ఇచ్చారని ఆ వార్తాసంస్థ తెలిపింది. కాగా, తమతో యుద్ధంలో పాల్గొనమని ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసిన మాట వాస్తవమేనని, దానిని తాము తిరస్కరించామని అమెరికా అధికారులు తెలిపారు. సాధ్యమైనంత వరకు చర్చల ద్వారా శాంతియుతంగానే సమస్యను పరిష్కరించేందుకు ట్రంప్ కృషి చేస్తారని పేర్కొన్నారు.

**మధ్యప్రాచ్యానికి బ్రిటన్ జెట్‌లు**

రెండు దేశాల మధ్య తీవ్రమైన పోరు జరుగుతున్న క్రమంలో జెట్‌లు, ఇతర మిలిటరీ సామగ్రిని తాము పశ్చిమాసియాకి తరలిస్తున్నట్టు బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ తెలిపారు. అయితే తాము ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడాన్ని ఆయన తోసిపుచ్చుతూ తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే తాము వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో అత్యవసర సహాయం కోసమే తాము జెట్‌లు, ఇతర సామగ్రిని తరలించామని ఆయన పేర్కొన్నట్టు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది.

**ఫ్రాన్స్ అప్రమత్తం**


తాజా పరిస్థితుల నేపథ్యంలో ఫ్రాన్స్ అప్రమత్తమైంది. తమ భూభాగంలో యూదులు, అమెరికన్లు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది. ప్రత్యేకంగా ప్రార్థనాస్థలాలు, పాఠశాలలు, విద్యాసంస్థలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు మత సంబంధమైన సమావేశాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచాలని ఫ్రాన్స్ మంత్రి బ్రూనో ఆదేశించారు.

**మాపై దాడికి పాల్పడ్డారో ఖబడ్దార్: ట్రంప్**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో అమెరికాకు ఎలాంటి పాత్ర లేదని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. తమ స్థావరాలపై ఇరాన్ ఎలాంటి ప్రతీకార దాడులకు పాల్పడినా కనీవినీ ఎరుగని స్థాయిలో చర్యలు తీవ్రంగా ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. 'ఇరాన్ మాపై ఏ విధంగానైనా, ఏ రూపంలోనైనా దాడి చేస్తే ఇంతకు ముందెన్నడూ లేని విధంగా అమెరికా సాయుధ దళాలు పూర్తి బలం, శక్తితో మీపైకి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. శనివారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అమెరికాకు ఎలాంటి ప్రమేయం లేదని ఆయన తన ట్రూత్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఆదివారం అమెరికాతో జరగాల్సిన ఆరో విడత అణు చర్చలను టెహ్రాన్ రద్దు చేసుకున్నప్పటికీ తాను ఈ రెండు దేశాల మధ్య ఏర్పడిన సంక్షోభాన్ని సులభంగా పరిష్కరించగలనని ఆయన అన్నారు.

**యుద్ధం అంచున ప్రపంచ దేశాలు**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ వాయుసేనతో దాడులు ప్రారంభించగానే గతంలో ఎన్నడూ లేని విధంగా మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఈసారి ఏర్పడనున్నాయని అమెరికాకు చెందిన ఒక ఉన్నతాధికారి హెచ్చరించారు. ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంతగా ప్రపంచ యుద్ధానికి దగ్గరలో ఉందని, ప్రస్తుత మూడో ప్రపంచ యుద్ధ ముప్పు ప్రచ్ఛన్న యుద్ధ యుగం కంటే కూడా ప్రమాదరమైనదని, ఆ ముప్పు దగ్గరలోనే ఉందని వాషింగ్టన్ పోస్ట్ నివేదిక పేర్కొంది.



## జిప్‌లైన్ రైడ్ చేస్తుండగా తెగిన కేబుల్..

**బాలిక పరిస్థితి విషమం**

నాగ్‌పూర్: జిప్‌లైన్ రైడ్ చేస్తుండగా పై నుంచి కింద పడి 12 ఏండ్ల బాలిక తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో చోటుచేసుకుంది. జూన్ 8న జరిగిన ఈ ప్రమాద ఘటన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన త్రిషా బిజ్వే అనే బాలిక వేసవి సెలవులు గడపేందుకు తన కుటుంబ సభ్యులతో కలసి మనాలికి వచ్చింది. అయితే ఆమె జిప్‌లైన్ రైడింగ్ చేస్తుంగా ఆమె జీన్‌కు అనుసంధానించిన తాడు తెగిపోవడంతో 30 అడుగుల ఎత్తు నుంచి కింద ఉన్న లోయలో పడి తీవ్రంగా గాయపడింది. అక్కడ ప్రమాద రక్షణ ఏర్పాట్లు ఏమీ లేవని, ప్రమాదం జరిగిన తర్వాత కూడా సంబంధిత సిబ్బంది స్పందించ లేదని బాలిక కుటుంబం ఆరోపించింది. దీంతో మనాలిలోని దవాఖానలో ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత ఆమెను చండీగఢ్‌కు తరలించామని, ప్రస్తుతం ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పారు. ఈ ప్రమాదానికి జిప్‌లైన్ నిర్వాహకులే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

## మధ్యప్రదేశ్‌లో కూలిన ఓవర్‌బ్రిడ్జ్

**ఆరుగురు కార్మికులకు తీవ్రగాయాలు**

భోపాల్ : బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన కూలి.. ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రూ.80 కోట్లతో నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జ్‌పై కార్మికులు కాంక్రీట్ పనులు చేస్తుండగా.. ఆదివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం సంభవించింది. శివపురి జిల్లాలో నిర్మిస్తున్న వంతెనలో కొంతభాగం కూలిందని, దాని కింద ఎవరూ లేనందున ప్రాణనష్టం తప్పిందని, గాయపడ్డ వారిని దవాఖానకు తరలించామని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. సుభం కన్‌స్ట్రక్షన్ అనే సంస్థకు నిర్మాణ పనులు అప్పగించినట్టు చెప్పారు.

# ఇంద్రాయణి నదిలో కూలిన వంతెన

- నలుగురి మృతి.. 18 మందికి గాయాలు
- మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఘటన



ముంబై, జూన్ 16 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఇంద్రాయణి నదిపై గల పురాతన ఐరన్ బ్రిడ్జి కూలిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడినట్టు పుణె జిల్లా మావల్ తహసీల్ అధికారులు తెలిపారు. ఇక్కడి కుండ్మాల గ్రామం సమీపంలో నదిపైన ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు వంతెన కూలిపోయినట్టు చెప్పారు. కుప్పకూలిన వంతెన శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాల్ని వెలికితీశామని, సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, గ్రామస్తులు, విపత్తు సహాయ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారని అధికారి ఒకరు తెలిపారు. కనీసం 38 మందిని ప్రమాదం నుంచి రక్షించామని, తీవ్రంగా గాయపడ్డ 18 మందిని వేర్వేరు దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నట్టు జిల్లా అధికారి ఒకరు చెప్పారు. ప్రమాద ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర సర్కార్ రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించింది. వంతెన వద్దకు వందలాది మంది చేరుకుంటున్నా, అక్కడ పోలీసుల పర్యవేక్షణ లేకపోవటం ప్రమాదానికి దారితీసిందన్న ఆరోపణలు వెలువడ్డాయి. దీనిపై విచారణ జరుపుతామని మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ చెప్పారు. పురాతన వంతెన తుప్పు పట్టిందని, కొత్త వంతెన నిర్మాణ ప్రణాళికకు ఓకే చేశామని డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అన్నారు. ఈ అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవటం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ స్పందించింది. నివారించగలిగిన ఈ ఘటనకు మహారాష్ట్ర సర్కార్ బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా అన్నారు. ఘటనాస్థలంలో రెస్క్యూ ఆపరేషన్‌ను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్టు మంత్రి గిరీశ్ తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నది ప్రవాహాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో టూరిస్టులు పాత వంతెన పైకి వచ్చి నిలబడినందువల్లే వంతెన కూలిందని అన్నారు.



## కేరళలో ఫైటర్ జెట్ అత్యవసర ల్యాండింగ్

*తిరువనంతపురం: బ్రిటిష్ ఎఫ్-35 ఫైటర్ జెట్ శనివారం రాత్రి 9.28 గంటల సమయంలో తిరువనంతపురం విమానాశ్రయంలో అత్యవసరంగా దిగింది. ఇంధనం తక్కువగా ఉండటంతో పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు విజ్ఞప్తి చేశారని.. దీంతో వెంటనే స్పందించి అది సురక్షితంగా దిగేందుకు సహకరించినట్టు ఎయిర్‌పోర్ట్ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఫైటర్ జెట్‌లో ఇంధనం నింపామని.. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అది తిరిగి బయలుదేరి వెళ్లడానికి అనుమతిస్తామని అధికారులు తెలిపారు. సముద్ర తీరానికి సుమారు వంద నాటికల్ మైళ్ల దూరంలో ఓ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ నుంచి ఆ ఫైటర్ జెట్ బయలుదేరినట్టు సమాచారం.*

# కూలిన హెలికాప్టర్

- పైలట్, ఆరుగురు యాత్రికుల మృతి
- ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం
- గుప్త్‌కాశీ నుంచి కేదార్‌నాథ్ వస్తుండగా దుర్ఘటన
- ఆరు వారాల్లో ఇది అయిదో ఘటన



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో వరుస హెలికాప్టర్ ప్రమాదాలు యాత్రికుల ప్రాణాలను గాల్లో దీపాలను చేస్తున్నాయి! తాజాగా గౌరీకుండ్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఓ ప్రైవేట్ హెలికాప్టర్ కూలిపోవడంతో పైలట్ సహా అందులోని ఆరుగురు ప్రయాణికులు దుర్మరణం చెందారు. కేదార్‌నాథ్ ధామ్ నుంచి గుప్త కాశీకి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేవలం ఆరు వారాల వ్యవధిలో రాష్ట్రంలో ఈ తరహా హెలికాప్టర్ ప్రమాదం జరగడం ఇది అయిదోసారి కావడం ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తున్నది. ఉదయం 5.19 నిమిషాలకు బయల్దేరినప్పుడు లోయలో తీవ్ర ప్రతికూల వాతావరణం ఉండటం వల్ల హెలికాప్టర్ ప్రయాణ దిశ నుంచి పక్కకు తప్పినట్టు తెలుస్తున్నది. దృష్టి గోచరత్వం సరిగా లేపోవడం, కఠిన వాతావరణం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అధికారులు నిర్ధారించారు. ప్రమాద నేపథ్యంలో చార్‌ధామ్ ప్రాంతంలో రెండు రోజుల పాటు హెలికాప్టర్ సర్వీసులను సస్పెండ్ చేశారు. హెలికాప్టర్ ఆపరేషన్స్ కోసం కఠినమైన ప్రామాణిక నిర్వహణ విధానాలను(ఎస్‌వోపీ) రూపొందించాలని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి అధికారులను ఆదేశించారు.

**నిబంధనల అమలు పట్టని బీజేపీ సర్కార్!**

బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో గగనతల ప్రయాణ సేవల నిబంధనలను ప్రైవేట్ ఏవియేషన్ కంపెనీలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. గత ఆరు వారాల్లో అయిదు హెలికాప్టర్ ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం ఇప్పటి వరకు కఠిన చర్యలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై విపక్షాలు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బు సంపాదనలో పడి హెలి కంపెనీలు నిబంధనలను గాల్లోకి వదిలేస్తున్నాయని.. ప్రభుత్వానికి వాటిపై నియంత్రణ లేని విషయాన్ని వరుస ప్రమాదాలు సూచిస్తున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూర్యకాంత్ విమర్శించారు.

# రూపానీ మృతదేహం గుర్తింపు

- ఎయిరిండియా విమాన ప్రమాద మృతులను గుర్తించేందుకు కొనసాగుతున్న డీఎన్ఏ పరీక్షలు
- ఇప్పటివరకు 47 మంది వివరాలను గుర్తించిన వైద్యులు
- 24 మృతదేహాలు వారి కుటుంబ సభ్యులకు అప్పగింత



ఓ మృతుడి అంత్యక్రియల్లో ఏడుస్తున్న కుటుంబ సభ్యులు

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో డీఎన్ఏ పరీక్ష ద్వారా గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీతో సహా 47 మంది మృతుల వివరాలను గుర్తించినట్టు వైద్యాధికారులు ఆదివారం తెలిపారు. ఇందులో రూపానీ సహా 24 మంది మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించినట్టు చెప్పా రు. ఇప్పటివరకు గుర్తించిన మృతుల్లో గుజరాత్, రాజస్థాన్‌కు చెందిన వారు ఎక్కువగా ఉన్నారని అదనపు సివిల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్ పటేల్ విలేకరులకు వెల్లడించారు. రూపానీ అంత్యక్రియలను రాజ్‌కోట్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి రిషికేశ్ పటేల్ తెలిపారు.

**కూలిన విమానానికి మా కంపెనీ మెయింటెనెన్స్ చేయలేదు: తుర్కియే**

కూలిన బోయింగ్ 787-8 ప్రయాణికుల విమానాలకు టర్కిష్ టెక్నిక్ కంపెనీ మెయింటెనెన్స్ చేసినట్లు వచ్చిన వార్తలు తప్పు అని తుర్కియే ప్రభుత్వం ప్రకటించింది. తుర్కియే-భారత్ మధ్య సంబంధాలపై ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేసే లక్ష్యంతోనే ఇదంతా జరుగుతున్నదని తెలిపింది. తమ ఒప్పందం పరిధిలోకి బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రాదని పేర్కొంది.

**ఒకరిది అదృష్టం.. మరొకరిది దురదృష్టం**

ఎయిరిండియా విమాన ప్రమాదం ఒకే కుటుంబానికి ఓ వైపు సంతోషాన్ని పంచి, మరోవైపు విషాదాన్ని మిగిల్చింది. 11ఏ సీట్లో కూర్చున్న విశ్వాస్ కుమార్ రమేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కానీ అదే విమానంలో ఉన్న ఆయన సోదరుడు అజయ్ తిరిగి రాని లోకాలకు తరలిపోయారు. వేరొక వరుసలో కూర్చున్న అజయ్, మరణించిన 241 మందిలో ఒకరు.




## ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య

**18 గంటలు ఆలస్యం**

*గువాహటి, జూన్ 15: శనివారం గువాహటి నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక సమస్య.. 170 మంది విమాన ప్రయాణికులకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. శనివారం రాత్రి 9.20 గంటలకు విమానాన్ని ఎక్కితే, 18 గంటల ఆలస్యంగా ఆదివారం మధ్యాహ్నం బయల్దేరింది. ఫ్లైట్ ఐఎక్స్-1226లో సాంకేతిక సమస్య తలెత్తటంతో లోక్‌ప్రియ గోపీనాథ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులందర్నీ రెండుమార్లు ఫ్లైట్ నుంచి కిందకి దింపారు. దీంతో ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలో అత్యంత బాధాకరమైన పరిస్థితిని ఎదుర్కొన్నారని తెలిసింది.*



# యూపీలో కూలిన ఆరు ఇండ్లు

- ముగ్గురు దుర్మరణం.. శిథిలాల కింద చిక్కుకున్న పలువురు
- తవ్వకాలు జరుపుతుండగా ఇండ్ల పునాదుల కదలికతో ప్రమాదం

లక్నో, జూన్ 15: ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఆదివారం తవ్వకం పనులు జరుపుతుండగా, పునాదులు కదిలి ఆరు ఇండ్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఈ ఘటనలో ముగ్గురు మరణించారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నారని అధికారులు అనుమానిస్తున్నారు. షాగంజ్ ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే మాయా తీలా అనే ప్రాంతంలో గుట్టలాంటి ఎత్తయిన ప్రాంతంలో తవ్వకాలు జరుపుతుండగా, చుట్టుపక్కల ఉన్న పలు ఇండ్లు, భవనాల పునాదాలు దెబ్బతిన్నాయని, ఒక్కసారిగా ఆరు ఇండ్లు కుప్పకూలాయని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, మృతుల్లో ఇద్దరు మైనర్ అక్కాచెల్లెళ్లు అని పేర్కొన్నారు.



## ఢిల్లీలో కూలిన 100 అడుగుల మొబైల్ టవర్

*న్యూఢిల్లీ, జూన్ 15: బలమైన ఈదురు గాలులు, భారీ వర్షం ధాటికి దక్షిణ ఢిల్లీలో 100 అడుగుల ఎత్తున్న ఓ మొబైల్ టవర్ కుప్పకూలింది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో సఫ్దార్ జంగ్ ఎన్‌క్లేవ్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాద ఘటనలో ఎవ్వరూ గాయపడలేదని స్థానిక పోలీసులు తెలిపారు. ఆప్ మాజీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి ఘటనాస్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. 'స్థానికులు, నేను వ్యతిరేకించినా ఇక్కడ మొబైల్ టవర్‌ను ఏర్పాటుచేశారు. ఈరోజు అది కుప్పకూలింది. ఒకవేళ ఇది పగటి సమయంలో జరిగివున్నా, బీ2 భవనంపైన పడివున్నా పరిస్థితి ఏంటి? ఇలాంటి నిర్లక్ష్య వైఖరి నేరం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.*